APTEL/2009/29308

# స్నేహిత ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు
తెలుగు దినపత్రిక
28-07-2026
మంగళవారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 275
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్
FOLLOW:
https://epaper.expresstelugudaily.com



ఫోరెన్సిక్ పాత్ర ఎంతో కీలకం 2



## రంగనాథ్‌కు ఎదురుదెబ్బ

### హైడ్రా కమిషనర్ స్థానం నుంచి రంగనాథ్‌ను తప్పించాలి

### సెక్రటరీ స్థాయి అధికారితో ఆ స్థానాన్ని భర్తీ చేయాలి

- లోతుకుంట భూముల వ్యవహారంలో సీఎస్ కు హైకోర్టు కీలక ఆదేశాలు
- హైడ్రాపైన 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు కావడం దేనికి సంకేతం
- కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడం మంచి పరిణామం కాదు
- హైడ్రా కేవలం ప్రభుత్వం ఆస్తుల రక్షణకే ఉంది..
- ప్రైవేట్ భూముల్లో జోక్యం చేసుకోవడానికి కాదన్న హైకోర్టు
- హైకోర్టుకు క్షమాపణలు చెప్పిన రంగనాథ్
- రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు
- చట్ట ప్రకారమే విధులు నిర్వర్తించాలి: బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:**

హైడ్రా కమిషనర్ స్థానం నుంచి రంగనాథ్ ను తప్పించాలని హైకోర్టు ఆదేశించింది. సెక్రటరీ స్థాయి అధికారితో ఆ స్థానాన్ని భర్తీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారంలో ఈ మేరకు హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. లోతుకుంటలోని సర్వే నెంబర్ 1, 2 లలో ఉన్న 40 ఎకరాల భూములు శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ స్వాధీనంలో ఉన్నాయి. ఈ భూముల్లో హైడ్రా జోక్యం చేసుకొని ఫెన్సింగ్ వేసిందని, కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ లెక్కచేయకుండా హైడ్రా వ్యవహరిస్తోందని శాంతాశ్రీరామ్ కంపెనీ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ పై వరుస విచారణలు చేపట్టిన హైకోర్టు వాదనల సందర్భంగానూ పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ నెల 20వ తేదీన శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఎండీ నరసయ్య కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకే చెందుతుందని కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వేశారని కోర్టుకు తెలిపింది. 20వ తేదీ జరిగిన విచారణ సందర్భంగా హైడ్రాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణకు పాల్పడినందుకు రంగనాథ్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు తీసుకురావాల్సిందిగా డీజీపీని ఆదేశిస్తామని పేర్కొంది. సాయంత్రంలోపు రంగనాథ్ విచారణకు హాజరవుతారని హైడ్రా తరపు న్యాయవాది కోర్టును కోరడంతో అంగీకరించింది. ఆ మేరకు రంగనాథ్ హాజరయ్యారు. హైడ్రా తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. సర్వే నెంబర్ 1,2 లలో ఉన్న..

మిగతా2లో...

## సింగరేణి నష్టాలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలే కారణం

- ఈ రెండు పార్టీలు భారీగా బకాయిలు పెట్టాయి
- సింగరేణి వ్యతిరేక విధానాలను కేసీఆర్ అవలంభించారు
- సింగరేణి భవిష్యత్తు కోసం తాడిచర్ల కోల్ బ్లాక్-2 కేటాయించాం
- ఇటీవల పదో తరగతి పరీక్షా పేపర్ లీక్‌కు బాధ్యత వహించాలి
- సీఎం పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి..
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ :** సింగరేణి నష్టాలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రధాన కారణమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణి వ్యతిరేక విధానాలను కేసీఆర్ అవలంభించారని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో బ్లాక్ వేలంలో పాల్గొనకుండా అడ్డుకున్నారని ఫైర్ అయ్యారు. ప్రధానిగా మోడీ వచ్చాక సింగరేణి విద్యుత్ ఉత్పత్తి సంస్థకు ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌ను కేటాయించారని గుర్తు చేశారు. సింగరేణికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు భారీగా బకాయిలు పెట్టాయని అన్నారు. సింగరేణి నష్టాలకు ఈ రెండు పార్టీలో కారణం అయ్యాయని కిషన్ రెడ్డి కామెంట్ చేశారు సింగరేణి భవిష్యత్తు కోసం తాడిచర్ల కోల్ బ్లాక్2 కేటాయించామని కిషన్ రెడ్డి అన్నారు. మణుగూరులోని పీకేవోసీ బ్లాక్ కూడా సింగరేణికే దక్కాలని భావించామని, అనూహ్యంగా సింగరేణికి పోటీగా జెన్‌కో వేలం పాల్గొన్నదని అన్నారు. సింగరేణి సంస్థ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని, పీకేఓసీ-డిప్ సైడ్ ఎక్స్‌టెన్షన్ బొగ్గు బ్లాక్‌ను తెలంగాణ జెన్‌కోకు కాకుండా సింగరేణికే కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు కొత్త బొగ్గు బ్లాకుల సాధనలో చొరవ చూపకపోవడంతో సింగరేణిపై రూ.54 వేల కోట్ల బకాయిల భారం పడిందని ఆయన విమర్శించారు. సింగరేణి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నైని, తాడిచెర్ల-2, పీకేఓసీ-డిప్ సైడ్ ఎక్స్‌టెన్షన్ బొగ్గు బ్లాకులను అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఒడిశాలోని నైని బ్లాక్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవసరమైన అనుమతులు లభించడంతో ఉత్పత్తి ప్రారంభమైందని చెప్పారు.ఈ మూడు బొగ్గు బ్లాకుల ద్వారా సుమారు 830 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు అందుబాటులోకి వస్తాయని, 6,500 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆయన వివరించారు. సింగరేణికి సుమారు రూ.1.95 లక్షల కోట్ల టర్నోవర్, రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపు రూ.40 వేల కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. ఈ ప్రయోజనాలను...

మిగతా2లో...



2

## తెలంగాణలో ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి

చిన్నపాటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదు ○ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్

## వాళ్లకు అడ్డుపడటమే నేను చేసిన తప్పు

- రెండేళ్ల కాలంలో చెరువులు, పార్కులను రక్షించాను
- రూ.1.5 లక్షల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కాపాడాం
- ల్యాండ్ మాఫియా, కబ్జాదారులు కోర్టులను తప్పదోవ పట్టిస్తున్నారు
- నాపై ఉన్న 63 కోర్టు ధిక్కరణ కేసులు బడా భూకబ్జాదారులు వేసినవే
- కేసులను చట్టపరంగా ఎదుర్కొంటాను
- నాకు న్యాయస్థానాలు, చట్టాలపై పూర్తి నమ్మకం, గౌరవం ఉన్నాయి : హైడ్రా కమిషనర్ రంగనాథ్



2

## నిరసనకారులపై బలప్రయోగాన్ని సమర్థించలేం

- ఆందోళనలను కారణంగా చూపి మితిమీరిన బలప్రయోగం చేయడం సరైన చర్య కాదు
- విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జీ చేయడాన్ని తప్పుపట్టిన సుప్రీం కోర్టు
- శాంతియుత నిరసనలు, పోలీసుల చర్యలపై ఏకరూప మార్గదర్శకాలు అవసరన్న సీజేఐ



2

## చివరకు రంగనాథ్ బలిపశువైండు

- ఈ కేసులో అసలు అపరాధి సీఎం రేవంత్ రెడ్డే
- హైడ్రాను పూర్తిగా నిషేధిస్తేనే పేదల ఇళ్లు సురక్షితంగా ఉంటాయి
- రేవంత్, ఎంఐఎం కనుసన్నల్లో హైడ్రా నడుస్తోంది
- ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరచి 'హైడ్రా'ను రద్దు చేయాలి: రాంచందర్ రావు



2




# రంగనాథ్‌కు ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

40 ఎకరాల భూమిలో జోక్యం హైడ్రా జోక్యం చేసుకోదని ఏజీ కోర్టుకు హామీ ఇచ్చారు. అఫిడవిట్ దాఖలు చేయాలంటూ హైకోర్టు విచారణను 23వ తేదీకి వాయిదా వేసింది. ఏజీ హామీ ఇచ్చినా హైడ్రా అధికారులు యంత్రాలతో మరోసారి తమ స్థలంలోకి వచ్చారని శాంతాశ్రీరామ్ కంపెనీ మధ్యంతర పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు హైడ్రాపై మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రైవేట్ స్థలానికి బ్రిగేడియర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో 10 మంది ఆర్మీ జవాన్లతో రక్షణ కల్పించాలని ఆదేశించింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించింది. అఫిడవిట్ దాఖలు చేస్తామని ఉత్తర్వులను వాయిదా వేయాలని ఏజీ కోరగా ఆ మేరకు కోర్టు ఒకరోజు గడువు ఇచ్చింది. 24వ తేదీ ఏజీ ప్రాథమిక అఫిడవిట్ దాఖలు చేశారు.ప్రైవేట్ భూమిలో జోక్యం చేసుకోలేదని, పూర్తి స్థాయి అఫిడవిట్ దాఖలు చేయడానికి సమయం కోరడంతో అంగీకరించిన హైకోర్టు హైడ్రా కమిషనర్ క్షమాపణలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ రోజు రంగనాథ్ అఫిడవిట్ దాఖలు చేశారు. హైకోర్టుకు క్షమాపణలు చెప్పిన రంగనాథ్ కోర్టులు, న్యాయవ్యవస్థపై తనకు ఎంతో గౌరవం ఉందని అఫిడవిట్‌లో పేర్కొంది. లోతుకుంటలోని సర్వే నెం 1,2 లలో ఉన్న 40 ఎకరాల భూమిలోకి హైడ్రా వెళ్లలేదని, పిటీషనర్ అవాస్తవాలు పేర్కొన్నరన్నారు. కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై ఉత్తర్వులు వెలువరించిన హైకోర్టు కమిషనర్ రంగనాథ్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని ఆదేశించింది. 9 తలలున్న విష సర్పంలా కమిషనర్ వ్యవహరిస్తున్నారని, బలగం, యంత్రాలతో భయాందోళనలు సృష్టిస్తున్నారన్నారు. కానీ సామాన్యులు న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించే హక్కు ఉందన్నారు. కోర్టు ఉత్తర్వులను అమలుపరిచే బాధ్యత ప్రభుత్వం, అధికారులపైన ఉందన్నారు. హైడ్రాపైన 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు కావడం దేనికి సంకేతమన్నారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడం మంచి పరిణామం కాదన్నారు. హైడ్రా కేవలం ప్రభుత్వం ఆస్తుల రక్షణకే ఉందని, ప్రైవేట్ భూముల్లో జోక్యం చేసుకోవడానికి కాదని హైకోర్టు పేర్కొంది. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ స్థానం నుంచి తప్పించి సెక్రటరీ స్థాయి అధికారిని వెంటనే నియమించాలనీ సీఎస్‌ను ఆదేశించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు 2 రోజుల్లోపు వెలువడే అవకాశం ఉంది.

రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలి..

హైడ్రా కమీషనర్ రంగనాథ్‌ను తొలగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రేవంత్ రెడ్డి వ్యక్తిగత బాధ్యత వహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు డిమాండ్ చేశారు. హైడ్రా పేదల ఇళ్లను కూల్చివేసిందని, హైడ్రా వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు బాధ పడుతున్నారని తెలిపారు. ఏ ఒక్క పెద్దల ఇళ్లను హైడ్రా కూల్చలేదని, మజ్లీస్‌కు సంబంధించిన సంస్థలను మాత్రం కూల్చలేదని, హైకోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు అని, హైడ్రాను సొంత సంస్థగా వాడుకుంటున్న రేవంత్ రెడ్డే దీనికి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

చట్ట ప్రకారమే విధులు నిర్వర్తించాలి..

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలన్న హైకోర్టు నిర్ణయాన్ని బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్ స్వాగతించారు. పేదల ఇళ్లపై ప్రతాపం చూపేందుకే సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా ఏర్పాటు చేశారని, 63 కోర్టు ధిక్కరణ కేసులు హైడ్రా కమిషనర్ వైఖరికి అద్దం పడుతోందని వమర్శించారు. లోతుకుంట, బహదూర్‌గూడ, అమీన్‌పూర్‌లో హైడ్రా అరాచకాల చిట్టా పెద్దదని తెలిపారు. పేదలకో న్యాయం, రేవంత్ రెడ్డి సోదరుడికి ఇంకో న్యాయమా? అని ప్రశ్నించారు. అధికారులు ఎవరైనా చట్ట ప్రకారమే విధులు నిర్వర్తించాలని, తప్పు చేసిన అధికారులపై బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక చర్యలుంటాయని వెల్లడించారు.

హైడ్రా చాలా అవసరం..

రంగనాథ్‌ను తప్పించమని హైకోర్టు చెప్పినట్లు తెలిసిందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ప్రజలకు హైడ్రా చాలా అవసరమని, అనేక చెరువులు, కుంటలు, నాలాలను కబ్జాల నుంచి హైడ్రా కాపాడిందని తెలిపారు.

# యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై నేడు చర్చ

**నేషనల్ బ్యూరో:** పబ్లిక్ పరీక్షల్లో అక్రమాల నిరోధానికి రూపొందించిన చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై జరిగిన ఆందోళనల్లో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసినందుకు హోంమంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలంటూ విపక్షాలు నినాదాల మధ్య బిల్లును సభ ముందుకు తీసుకొచ్చింది. అయితే విపక్షాల నిరసనలతో ఎలాంటి చర్చ జరగనుండానే ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధికార, విపక్ష సభ్యులతో చర్చించి సయోధ్య కుదిర్చారు. దీనితో మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది.

పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలను లీక్ చేసే వారిని కఠినంగా శిక్షించడమే లక్ష్యంగా కేంద్రం పరీక్షల్లో అక్రమాల నిరోధక చట్ట సవరణ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టింది. విపక్ష సభ్యుల ఆందోళన మధ్య..



కేంద్రమంత్రి జితేంద్రసింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. పేపర్ లీకేజీలు, పరీక్షల అక్రమాలపై ఉక్కుపాదం మోపేలా చట్టంలో కీలక సవరణలు ప్రతిపాదించినట్లు తెలిపారు. అయితే విపక్షాలు నిరసన కొనసాగించడం వల్ల చర్చ సాధ్యపడలేదు. ఈ క్రమంలో సభ మొదట 12 గంటలకు తర్వాత 2గంటలకు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తర్వాత కూడా విపక్షాలు ఆందోళన కొనసాగించగా స్పీకర్ అధికార, విపక్ష సభ్యులకు 3 గంటలు సమయం ఇచ్చారు. విభేదాలు పరిష్కరించుకోవాలని కోరుతూ సభను సాయంత్రం ఐదు గంటలకు వాయిదా వేశారు. అయితే తిరిగి సమావేశమైనా పరిస్థితిలో మార్పు లేకపోవడం వల్ల సభ మంగళవారానికి వాయిదా పడింది.రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై ఆందోళన చేసిన విద్యార్థులపై లాఠీఛార్జ్ పై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి. వారి నిరసనల మధ్య సభ మూడు సార్లు వాయిదా పడింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో బిల్లును సభలో ప్రవేశపెట్టి చర్చించేందుకు సభ్యులు సహకరించాలని రాజ్యసభ ఉపాధ్యక్షుడుహరివంశ్ సింగ్ కోరినప్పటికీ విపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించారు. ఈ క్రమంలో సభ సాయంత్రం 5గంటల 15 నిమిషాలకు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తర్వాతచర్చకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విపక్షాలను మరోసారి కోరారు."పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో అక్రమాల నిరోధానికి అత్యంత కీలకమైన బిల్లును తీసుకొచ్చాం. ఈ బిల్లుపై చర్చ కోసం నిన్న కోరాను. ఇవాళ ఉదయం నుంచి అభ్యర్థిస్తూనే ఉన్నాను.కానీ మీరు (విపక్షాలు)వ్యతిరేకిస్తున్నారు. మళ్లీ కాంగ్రెస్ వాళ్లు బయటకు వెళ్లి సభలో మమ్మల్ని మాట్లాడనియ్యడం లేదని చెబుతున్నారు. నేను చేతులు జోడించి కోరుతున్నా, మీరు సభలో మాట్లాడండి. కానీ మీరేమో మాట్లడడం లేదు. ఇదేం పద్ధతి?" అని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అయితే విద్యార్థులపై లాఠీఛార్జ్ విషయంలో హోంమంత్రి ప్రకటన చేయాలని విపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే డిమాండ్ చేశారు. "చర్చకు మేమేమీ భయపడడం లేదు. చర్చకు సిద్ధంగా ఉన్నాం. కానీ హోంమంత్రి సభకు వచ్చి ప్రకటన చేయాలి. లాఠీఛార్జ్ చేసి విద్యార్థులను చావగొట్టారు. దీనిపై సమాధానం చెప్పాలి" అని మల్లికార్జున ఖర్గే అని అన్నారు. దీని తర్వాత ఉపాధ్యక్షుడు హరివంశ్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

అయితే లోక్‌సభలోని అన్నిపక్షాలతో సమావేశమైన స్పీకర్ ఓంబిర్లా అత్యంత కీలకమైన బిల్లుపై చర్చకు సహకరించాలని కోరారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంగళవారం చర్చచేపట్టేందుకు అన్నిపక్షాలు అంగీకరించినట్లు పార్లమెంటు వర్గాలు తెలిపాయి.

ఈ బిల్లులో ఏముంది?

ఈ ప్రతిపాదిత బిల్లు ప్రకారం, పరీక్షల్లో అక్రమ పద్ధతులను అవలంబిస్తే కనీసం 5 ఏళ్ల నుంచి గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పులు ప్రతిపాదించారు. జరిమానాను రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచేందుకు ప్రతిపాదన చేశారు. సర్వీస్ ప్రొవైడర్స్‌కి విధించే జరిమానాను రూ.1కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచుతూ నిబంధన చేర్చారు. పరీక్షల నుంచి సర్వీస్ ప్రొవైడర్స్‌ని నిషేధించే కాలాన్ని 4 ఏళ్ల నుంచి 8 ఏళ్లకు పొడిగిస్తూ ప్రతిపాదనలు చేశారు. ఒక వేళ నేరం రుజువైతే, కంపెనీ డైరెక్టర్లు లేదా ఉన్నతాధికారులకు కనీసం 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 కోట్ల వరకు జరిమానా విధించనున్నారని తెలుస్తోంది.

# ఫోరెన్సిక్ పాత్ర ఎంతో కీలకం



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర విచారణలో శాస్త్రీయ ఆధారాల ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా నియమితులైన 57 మందికి డీజీపీ నియామక పత్రాలను అందజేశారు. ఫోరెన్సిక్ పరీక్షల వేగం మరింత పెరగడమే కాకుండా, పోలీసు దర్యాప్తుకు కీలకమైన ఆధారాలు సకాలంలో లభించనున్నాయి. ఇందు లో 57 మందిలో 35 మంది పీహెచ్‌డీ పట్టా పొందిన వారు కాగా, 12 మంది ఎమ్మెస్సీ, ఐదుగురు ఎంటెక్, ముగ్గురు ఎంసీఏ పట్టభద్రులు ఉన్నారు. రాష్ట్ర డీజీపీ సీవీ అనంద్ తో పాటు హోం శాఖ ముఖ్య కార్యదర్శి, ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖా గోయల్ ఈ కార్యక్రమంలో పాల్గొని కొత్త సిబ్బందికి ల్యాబ్ పనితీరుపై దిశానిర్దేశం చేశారు.

న్యాయం జరగాలంటే ఫోరెన్సిక్ నివేదికలు సకాలంలో అందాలి..

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. దేశంలో అమల్లోకి వచ్చిన కొత్త నేర చట్టాల ప్రకారం ఫోరెన్సిక్ పాత్ర ఎంతో కీలకమని స్పష్టం చేశారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరగాలంటే ఫోరెన్సిక్ నివేదికలు సకాలంలో అందాలని, ఇందులో ఫోరెన్సిక్ పాత్ర కీలకమని గుర్తుచేశారు. ముఖ్యంగా సున్నితమైన, సంచలనం సృష్టించిన కేసుల్లో నివేదికలను నిర్ణీత గడువులోగా అందించాలని సూచించారు. ల్యాబ్‌లో అందుబాటులో ఉన్న అత్యాధునిక పరికరాలు, అంతర్జాతీయ ప్రమాణాలను అందిపుచ్చుకుని వృత్తి నైపుణ్యాన్ని నిరంతరం పెంచుకోవాలని అన్నారు.తెలంగాణ ఎఫ్ఎస్ఎల్ ఇప్పటికే ఎన్ఏబీఎల్ గుర్తింపు పొంది, అత్యాధునిక మౌలిక వసతులతో కొనసాగుతోంది.పెరుగుతున్న డ్రగ్స్ కేసులు, సైబర్ నేరాలను ఛేదించేందుకు ల్యాబ్‌ను మరిన్ని అధునాతన హంగులతో తీర్చిదిద్దుతున్నామని, సిబ్బంది కొరత తీర్చేందుకు ప్రభుత్వం అన్ని రకాల సహకారం అందిస్తుందని డీజీపీ హామీ ఇచ్చారు.

గత ఏడాది 18,647 కేసుల పరిష్కారం..

ఈ సందర్భంగా శిఖా గోయల్ మాట్లాడుతూ.. ఫోరెన్సిక్ విభాగంలో చేరడం వల్ల డీఎన్ఏ విశ్లేషణ, కంప్యూటర్ ఫోరెన్సిక్, నార్కోటిక్స్, టాక్సికాలజీ వంటి కీలక విభాగాల్లో పరిశోధనలు ఖచ్చితత్వంతో సాగనున్నాయని పరిమిత సిబ్బందితోనే గత ఏడాది 18,647 కేసులను పరిష్కరించి, 86 శాతం రికార్డు స్థాయి పరిష్కార రేటును సాధించామని ఆమె వెల్లడించారు. దేశంలోనే అత్యధిక కేసులు పరిష్కరిస్తున్న ల్యాబ్‌లలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని ఆమె వివారించారు.

# తాడిచెర్ల-2 ప్రాజెక్టును వేగవంతం చేయాలి

**న్యూఢిల్లీ:** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ శక్తి (కార్మిక, శిక్షణ, ఉపాధి, ఫ్యాక్టరీస్) మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి సోమవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, గనుల పురోగతి, మౌలిక వసతుల విస్తరణ, కార్మిక సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించారు.ముందుగా కేంద్ర కార్మిక & ఉపాధి శాఖ మంత్రి డా. మన్సుఖ్ మాండవీయను కలిసి తెలంగాణలో కార్మిక సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపు, కేంద్ర పథకాల అమలులో రాష్ట్రానికి మరింత సహకారం అందించాలని కోరారు. అనంతరం కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరిని కలిసి యువతకు అత్యాధునిక నైపుణ్య శిక్షణ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల అభివృద్ధి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాల విస్తరణపై చర్చించారు.

తదనంతరం కేంద్ర బొగ్గు & గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కలిసి పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి అత్యంత కీలకమైన తాడిచెర్ల2 బొగ్గు గని ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రాజెక్టు ఆలస్యం కాకుండా త్వరగా పూర్తి చేసి, స్థానిక యువతకు కనీసం వెయ్యి ఉద్యోగాలు కల్పించాలని, ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల వారికి ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నిర్వాసిత కుటుంబాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద సమగ్ర పునరావాసం, పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కూడా విజ్ఞప్తి చేశారు.అదే విధంగా సింగరేణి సంస్థలో పదవీ విరమణ పొందిన కార్మికులకు కనీస నెలవారీ రూ.10 వేల పెన్షన్ అందేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తక్కువ పెన్షన్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేలాది మంది రిటైర్డ్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సింగరేణి విస్తరణ, కొత్త బొగ్గు గనుల అభివృద్ధి, గనుల ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా తాడిచెర్ల2 ప్రాజెక్టు పనుల వేగవంతం, స్థానికులకు ఉద్యోగాల కల్పన, ఆర్అండ్ఆర్ అమలు, సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ అంశాలను సంబంధిత శాఖలతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, "తెలంగాణ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల విస్తరణ, కార్మికుల సంక్షేమం, గనుల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేస్తాం. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశంపై నిరంతరం కృషి చేస్తూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం" అని పేర్కొన్నారు.



# సింగరేణి నష్టాలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలే కారణం

(మొదటి పేజీ తరువాయి)

దృష్టిలో ఉంచుకుని పీకేఓసీ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాస్తానని తెలిపారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రజా పరీక్షల అక్రమాల నిరోధక బిల్లు పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచి, ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేలా మరింత కఠిన నిబంధనలతో రూపొందించామని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు నిర్మాణాత్మకంగా సహకరించాలని కోరారు. విద్యార్థుల సమస్యల విషయంలో కేంద్ర ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కారం చూపే విధానాన్ని అనుసరిస్తోందని, అయితే కాంగ్రెస్ పార్టీ రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. గతంలో జరిగిన ప్రశ్నపత్రాల లీకేజీలపై రాష్ట్ర ప్రభుత్వం కూడా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. విదేశీ నిధుల నియంత్రణ చట్టం అమలు ద్వారా చట్టబద్ధంగా వచ్చే నిధులకు ఎలాంటి ఆటంకం లేదని, అక్రమంగా నిధులను దుర్వినియోగం చేసే వారిపైనే చర్యలు తీసుకుంటున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్ర అభివృద్ధితో పాటు అమరవీరుల కుటుంబాలకు తగిన న్యాయం చేస్తామని తెలిపారు.

ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని జెన్‌కోను వేలంలో పాల్గొనకుండా చూడాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోను పేపర్ లీక్‌లు విచ్చలవిడిగా జరిగాయని కిషన్ రెడ్డి ఆదేశించారు. ఇక ఇటీవల పదో తరగతి పరీక్షా పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తాను రాజీనామా చేయకుండా ఇతరులను అడగడం సరికాదని చురకలంటించారు. దేశ హితం కోసం ఏ వ్యవస్థ వచ్చినా తప్పు లేదని.. దేశానికి నష్టం చేసే వ్యవస్థ వస్తే ప్రమాదకరమని కిషన్ రెడ్డి అన్నారు.

# వాళ్లకు అడ్డుపడటమే నేను చేసిన తప్పు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** హైడ్రా కమిషనర్‌గా ఈ రెండేళ్ల కాలంలో చెరువులు, పార్కులను రక్షించానని.. రూ.1.5 లక్షల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కాపాడామని రంగనాథ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ''బడా బాబులు ఆక్రమించిన వందల ఎకరాలను ధైర్యంగా కాపాడాం. ల్యాండ్ మాఫియా, కబ్జాదారులు కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారు. శాంతా శ్రీరామ్ అనే స్థిరాస్తి సంస్థ సుమారు రూ.10 వేల కోట్ల విలువైన లోతుకుంట భూమిని కొట్టేయాలని చూసింది. అనుమతి లేకుండా చారిత్రక గుట్టలను బ్లాస్టింగ్ చేస్తున్నారు. చెట్లు, గుట్టలను శాంతా శ్రీరామ్ సంస్థ విచ్చలవిడిగా విధ్వంసం చేసింది. సేవ్ ది రాక్స్ ఫిర్యాదుతో హైడ్రా రంగంలోకి దిగింది. నాపై ఉన్న 63 కోర్టు ధిక్కరణ కేసులు బడా భూకబ్జాదారులు వేసినవే. బతుకమ్మకుంట చెరువును మింగేయాలని ఒకరు చూశారు. లోతుకుంటలో రూ.వేల కోట్ల ప్రభుత్వ భూమిని కొట్టేయాలని మరొకరు చూశారు. సామాన్యుల ప్లాట్లు కొట్టేసి కాంప్లెక్సులు కట్టాలని సంధ్యా శ్రీధర్‌రావు చూస్తున్నారు. సింగరేణి కార్మికుల ప్లాట్లను కొట్టేయాలని నల్ల మల్లారెడ్డి చూశారు. విలువైన సామాన్యుల ప్లాట్లు, ప్రభుత్వ భూములను ముఖీం ఆక్రమించారు'' అని రంగనాథ్ తెలిపారు. ''అక్రమార్కులందరికీ హైడ్రా కమిషనర్‌గా అడ్డుపడటమే నేను చేసిన తప్పు. కేసులను చట్టపరంగా ఎదుర్కొంటాను. నాకు న్యాయస్థానాలు, చట్టాలపై పూర్తి నమ్మకం, గౌరవం ఉన్నాయి. గత, ప్రస్తుత, భవిష్యత్తు ప్రభుత్వాలు ఏ బాధ్యతలు ఇచ్చినా పని చేస్తాను. ఏ పని అప్పగించినా 100 శాతం ఫలితాలు ఇవ్వడమే నా లక్ష్యం. భవిష్యత్తులోనూ ఇదే నిబద్ధతతో పనిచేస్తాను'' అని రంగనాథ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

# ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి..

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి రంగనాథ్‌ను తప్పించాలంటూ తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. హైడ్రా కమిషనర్‌ను తొలగించాలని హైకోర్టు ఆదేశించడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణిని తేటతెల్లం చేసిందన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేసిన కవిత.. అక్రమ కట్టడాల పేరుతో పేదల నివాసాలను ఇష్టారాజ్యంగా కూల్చివేసిన ప్రభుత్వానికి ఇది చెంపపెట్టు అన్నారు. న్యాయస్థానం ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘిస్తున్న హైడ్రాపై మిలిటరీ యాక్షన్‌కు ఆదేశిస్తామని హైకోర్టు హెచ్చరించినా హైడ్రా తీరు మారలేదని ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని పెద్ద వాళ్లకు ఒక న్యాయం, పేద వాళ్లకు ఒక న్యాయం అనే విధంగా కాకుండా పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఓ ప్రైవేట్ భూమి విషయంలో హైకోర్టు ఆదేశాలు ఉన్నా రంగనాథ్ వాటిని ఉల్లంఘించారని అలాగే ఆయనపై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని అన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేస్తూ అతడిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా ఇటీవల హైడ్రాకు కవితకు మధ్య బిగ్ ఫైట్ నడిచింది. రేవంత్ రెడ్డి వచ్చాక హైడ్రా అనే మహమ్మారిని తీసుకువచ్చారని కవిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇటీవల తాము గండిపేట మండలం నార్సింగ్‌లో ఓ ప్రైవేట్ సంస్థ మూసీ నది మధ్యలో నిర్మాణాలు చేపడుతుంటే ఆందోళన చేస్తే హైడ్రా మమ్మల్నే బద్నాం చేయాలని చూస్తోందని కమిషనర్ రంగనాథ్ తీరుపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదంలో మిస్టర్ రంగనాథ్ మిమ్మల్ని మేము కోర్టుకు ఈడిస్తామంటూ గతంలో హెచ్చరించారు. అయితే తాజాగా హైకోర్టు రంగనాథ్ ను తొలగించాలని ఆదేశించిన నేపథ్యంలోపై స్పందించారు.

# తెలంగాణలో ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పార్టీ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పార్టీ నాయకత్వానికి సూచించారు. సోమవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో తెలంగాణ సంస్థాగత వ్యవహారాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. దాదాపు రెండు గంటలపాటు కొనసాగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో పార్టీ సంస్థాగత కార్యక్రమాల పురోగతి, ఎస్ఐఆర్ ప్రక్రియలో పార్టీ పనితీరు, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపట్టిన సంస్థాగత కార్యక్రమాలపై కేసీ వేణుగోపాల్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమం అమలు తీరు ప్రశంసనీయంగా ఉందని ఆయన అభినందించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, బుధవారం ఉదయం 10 గంటలకు ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన టీపీసీసీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత కార్యక్రమాల పురోగతితో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# చివరకు రంగనాథ్ బలిపశువైండు..

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** 'హైడ్రా' కమిషనర్‌గా తక్షణమే తప్పించాలంటూ తెలంగాణ హైకోర్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సంచలన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఇదే అంశంపై తాజాగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. నిరుపేదల పట్ల 'హైడ్రా' వ్యవహరిస్తున్న తీరుపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు సీఎం రేవంత్ రెడ్డి చెంపపెట్టు అని కామెంట్ చేశారు. చివరికి 'హైడ్రా' కమిషనర్ రంగ నాథ్‌ను బలిపశువును చేశారని అన్నారు. ఈ కేసులో అసలు అపరాధి సీఎం రేవంత్ రెడ్డేనని రామచందర్ రావు ఆరోపించారు. హైడ్రాను పూర్తిగా నిషేధిస్తేనే పేదల ఇళ్లు సురక్షితంగా ఉంటాయని అన్నారు. రేవంత్, ఎంఐఎం కనుసన్నల్లో హైడ్రా నడుస్తోందని ఫైర్ అయ్యారు. హైడ్రా ఇప్పటికీ ఫాతిమా కాలేజీతో పాటు బాడాబాబుల జోలికి వెళ్లకుండా వాళ్లకు కొమ్ముకాస్తోందని ధ్వజమెత్తారు. మొదటి నుంచి పెదల ఇళ్లను మాత్రమే టార్గెట్ చేసుకుని దమనకాండ చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరచి 'హైడ్రా'ను రద్దు చేయాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు.

# లివ్‌లైఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వెయిట్ లాస్ ఛాలెంజ్ విజయవంతం

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ప్రజల్లో ఊబకాయం, జీవనశైలి వ్యాధులపై అవగాహన పెంచుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా లివ్‌లైఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన "భారత్‌లోనే అతిపెద్ద మూడు నెలల వెయిట్ లాస్ ఛాలెంజ్" విజయవంతంగా ముగిసింది. ఓఎస్ఎస్ఐ ప్రెసిడెంట్ ఎలెక్ట్, లివ్‌లైఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా. నందకిషోర్ దుక్కిపాటి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వేలాది మంది పాల్గొని విశేష ఫలితాలను సాధించారు. ఈ కార్యక్రమం పూర్తైన సందర్భంగా గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్ లో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు, పలువురు ప్రముఖులు ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందించారు. ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలను ఆశించకుండా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ వెయిట్ లాస్ ఛాలెంజ్‌ను నిర్వహించడం ఎంతో అభినందనీయమని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మశ్రీ డా. విజయానంద్ రెడ్డి ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందిస్తూ నేటి కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, కూర్చునే జీవనశైలి కారణంగా ప్రజల్లో ఊబకాయం పెరుగుతోందని, ఇలాంటి ఆరోగ్య ఉద్యమాలు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని, ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఒక సభ్యుడు కేవలం మూడు నెలల్లోనే 15 నుంచి 18 కిలోల వరకు బరువు తగ్గి, తన గట్ హెల్త్, శారీరక దృఢత్వం, జీవనశైలిలో గణనీయమైన మార్పు వచ్చిందని తెలిపారు. ఇప్పుడు ప్రతి రోజును ఉత్సాహంగా ప్రారంభిస్తున్నానని, ఈ కార్యక్రమం తన జీవితాన్నే మార్చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డా. నందకిషోర్ దుక్కిపాటికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.







## మెట్రో స్టేషన్లు మరింత మోడల్‌గా



- ప్రయాణికుల సౌకర్యాలపై హెచ్ఎంఆర్ఎల్ ప్రత్యేక దృష్టి
- తొలి దశలో 10 స్టేషన్ల సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ
- బేగంపేట్ నుంచి రాయదుర్గ్ వరకు క్షేత్రస్థాయిలో అదనపు ఎండీ అజిత్‌రెడ్డి తనిఖీ
- పారిశుధ్యం, భద్రత, నిర్వహణలో రాజీ లేదని స్పష్టీకరణ
- ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలే లక్ష్యమని వెల్లడి

**తెలంగాణ బ్యూరో** : హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్ఎల్) ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. మెట్రో స్టేషన్లను అన్ని విధాలా తీర్చిదిద్ది ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించాలని హెచ్ఎంఆర్ఎల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వెంటనే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. బేగంపేట్ నుంచి రాయదుర్గ్ వరకు మెట్రోలో ప్రయాణించిన అజిత్‌రెడ్డి పలు కీలక స్టేషన్లను పరిశీలించారు. బేగంపేట్, అమీర్‌పేట్, రాయదుర్గ్ స్టేషన్లలోని ప్లాట్‌ఫామ్‌లు, కాంకోర్స్ ప్రాంతాలు, ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మెట్రో ఇంజినీర్లు, నిర్వహణ సంస్థ కియోలిస్ ప్రతినిధులతో మాట్లాడి సేవల నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాయదుర్గ్ స్టేషన్ వద్ద ఉన్న స్కైవాక్, ఐటీ సంస్థలకు అనుసంధాన మార్గాలు, మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద ప్రయాణికుల రాకపోకలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**పారిశుధ్యం, నిర్వహణపై రాజీ లేదు**

స్టేషన్లలో పారిశుధ్యం, నిర్వహణ, వాణిజ్య సముదాయాల నిర్వహణ తీరును కూడా అజిత్‌రెడ్డి సమీక్షించారు. ప్రయాణికులకు అందించే సేవల్లో పరిశుభ్రత, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడొద్దని స్పష్టం చేశారు. నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏజెన్సీల పనితీరును నిరంతరం సమీక్షించాలని, నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెట్రో స్టేషన్లను స్థానిక అవసరాలకు అనుగుణంగా మరింత ఆధునికంగా అభివృద్ధి చేయాలని అజిత్‌రెడ్డి సూచించారు. ఇందులో భాగంగా తొలి దశలో 10 మెట్రో స్టేషన్లను ఎంపిక చేసి వాటిని సమగ్రంగా అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం మిగిలిన అన్ని స్టేషన్లను కూడా దశలవారీగా అభివృద్ధి చేసే ప్రణాళికను అమలు చేయనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో అన్ని మెట్రో స్టేషన్లను స్వయంగా సందర్శించి ప్రయాణికుల సౌకర్యాలు, పార్కింగ్, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లను క్రమం తప్పకుండా సమీక్షిస్తానని ఆయన వెల్లడించారు. నగరవాసులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, ప్రశాంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే హైదరాబాద్ మెట్రో రైల్ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## ఇరాన్‌కు నెతన్యాహు హెచ్చరిక

- అణు కార్యక్రమాన్ని పూర్తిగా విరమించుకోవాలని స్పష్టీకరణ
- ట్రంప్‌తో భేటీకి ముందు ఇజ్రాయెల్ ప్రధాని కీలక వ్యాఖ్యలు
- దౌత్యానికి అవకాశం ఇస్తున్న అమెరికా.. అన్ని సైనిక మార్గాలు సిద్ధమేనన్న వాషింగ్టన్
- హోర్ముజ్‌లో ట్యాంకర్ పేలుడు.. అప్రమత్తమైన ఇరాన్
- మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొల్పాలని పోప్ పిలుపు



**జెరూసలేం/వాషింగ్టన్** : అమెరికా పర్యటనకు బయలుదేరే ముందు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇరాన్‌పై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దౌత్యపరమైన ఒప్పందాలు కుదిరినా, కుదరకపోయినా ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని పూర్తిగా విరమించుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. సోమవారం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో జరగనున్న సమావేశానికి ముందు చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని నిలిపివేయడంతో పాటు ప్రాంతీయ విధానాలను మార్చుకోవడం లేదా అక్కడ రాజకీయ మార్పులు చోటుచేసుకోవడం ద్వారానే ప్రస్తుత సంక్షోభానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని నెతన్యాహు అభిప్రాయపడ్డారు. మరోవైపు అమెరికా మాత్రం ఇరాన్ విషయంలో దౌత్య మార్గానికి ప్రాధాన్యం ఇస్తున్న సంకేతాలు ఇచ్చింది. ఐక్యరాజ్యసమితిలో అమెరికా ప్రతినిధి మైక్ వాల్జ్ మాట్లాడుతూ, అధ్యక్షుడు ట్రంప్ చర్చలకు అవకాశం కల్పించేందుకే తాత్కాలికంగా వైమానిక దాడులను నిలిపివేసినట్లు తెలిపారు. వివిధ స్థాయిల్లో దౌత్య చర్చలు కొనసాగుతున్నాయని, ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు కూడా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే అవసరమైతే సైనిక చర్యలకు సంబంధించిన అన్ని ప్రత్యామ్నాయాలు అమెరికా వద్ద సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

**హోర్ముజ్‌లో ఉద్రిక్తత**

ఇరాన్ కూడా తన వైమానిక రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలుస్తోంది. నెతన్యాహు అమెరికా పర్యటనకు ముందే భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేసినట్లు సమాచారం. ఇదే సమయంలో హోర్ముజ్ జలసంధిలో నిర్ణయించిన సముద్ర మార్గం నుంచి దారితప్పిన ఒక ఆయిల్ ట్యాంకర్ నావికా మైన్‌ను ఢీకొని పేలిపోయినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. ఇరాన్ సూచించిన సముద్ర మార్గాలను తప్పించి ప్రయాణిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇప్పటికే హెచ్చరించిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హమైంది. అమెరికా తమ వ్యూహాత్మక లక్ష్యాలను సాధించలేకపోయిందని ఇరాన్ సైనిక ప్రతినిధి మహమ్మద్ అక్రమినియా వ్యాఖ్యానించారు. ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకాయానాన్ని సాధారణ స్థితికి తీసుకురావడానికి ఇరాన్, ఒమన్ మధ్య దౌత్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఒమన్ ప్రతినిధులు టెహ్రాన్‌లో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. సముద్ర మార్గాల్లో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ఇరు దేశాలు పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది.

**శాంతికి పోప్ పిలుపు**

మధ్యప్రాచ్య ఘర్షణల నేపథ్యంలో వాటికన్ నుంచి పోప్ లియో పద్నాలుగో వారు శాంతికి పిలుపునిచ్చారు. యుద్ధం కారణంగా సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రాణనష్టం, ఆస్తినష్టం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక అవసరాల కొరత మరింత తీవ్రంగా మారుతోందని పేర్కొన్నారు. అన్ని పక్షాలు వెంటనే సైనిక చర్యలను నిలిపివేసి, దౌత్య చర్చల ద్వారా శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## కరూర్ ఘటన బాధితులకు ఉద్యోగాలు.. రద్దు

**చెన్నై:** కరూర్ తొక్కిసలాట ఘటనలో మరణించిన బాధితుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు రద్దు చేసింది. ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో రాజ్యాంగం నిర్దేశించిన సమానత్వ సూత్రాలను విస్మరించరాదని స్పష్టం చేసిన న్యాయస్థానం, ఇలాంటి నియామకాలు ఆర్టికల్ 14, ఆర్టికల్ 16 స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంది. భవిష్యత్తులో ఇదే తరహా ఘటనల్లో కూడా ఉద్యోగాలు ఇవ్వాలనే డిమాండ్లకు ఇది దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. కరూర్ తొక్కిసలాట ఘటనలో మరణించిన బాధితుల కుటుంబాలకు కారుణ్య నియామకాల పేరుతో ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు, ప్రభుత్వ ఉద్యోగాలు సమాన అవకాశాల ఆధారంగా మాత్రమే భర్తీ చేయాలని పేర్కొంది. ప్రత్యేక పరిస్థితులను చూపుతూ ఇలాంటి నియామకాలు చేపట్టడం రాజ్యాంగంలోని సమానత్వ హక్కును దెబ్బతీస్తుందని స్పష్టం చేసింది.

**కరూర్ తొక్కిసలాట నేపథ్యం**

గత ఏడాది సెప్టెంబరులో కరూర్‌లో నిర్వహించిన టీవీకే సభలో జరిగిన తొక్కిసలాటలో చిన్నారులతో సహా 41 మంది ప్రాణాలు కోల్పోయారు. సభకు భారీగా జనం తరలివచ్చిన నేపథ్యంలో తాగునీరు, ఆహారం, పారిశుధ్య సదుపాయాలు సరిపోకపోవడం, జనసమీకరణ నియంత్రణలో లోపాలు చోటుచేసుకున్నాయని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. నిర్వాహకుల నిర్లక్ష్యమే ఘటనకు కారణమని పోలీసులు పేర్కొనగా, టీవీకే మాత్రం వాటిని ఖండించింది. పోలీసుల వైఫల్యమే అసలు కారణమని ఆరోపించింది. ఈ ఘటనపై దర్యాప్తును గతంలో రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటీ) నిర్వహించింది. అయితే స్వతంత్ర విచారణ అవసరమని భావించిన సుప్రీంకోర్టు, 2025 అక్టోబరులో కేసును సీబీఐకి బదిలీ చేసింది. ప్రస్తుతం సభ నిర్వహణ, జనసమీకరణ ఏర్పాట్లు, నిర్వాహకుల పాత్ర, స్థానిక అధికారులతో జరిగిన సమన్వయం తదితర అంశాలపై సీబీఐ దర్యాప్తు కొనసాగిస్తోంది. కరూర్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 32 మంది బాధితుల కుటుంబ సభ్యులకు ఇటీవల ప్రభుత్వం కారుణ్య నియామక పత్రాలు అందజేసింది.

# యాంటీ పేపర్ లీక్ చట్టానికి శ్రీకారం

- ప్రజా పరీక్షల సవరణ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రం
- స్పీకర్ చొరవతో చర్చకు అంగీకరించిన అధికార, ప్రతిపక్షాలు
- నీట్, యూజీసీ-నెట్ సహా పరీక్షల అక్రమాలపై ఉక్కుపాదం
- పేపర్ లీకుకు పాల్పడితే 10 ఏళ్ల జైలు.. రూ.కోటి జరిమానా ప్రతిపాదన
- విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని సభలో స్పీకర్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ** : దేశవ్యాప్తంగా ప్రజా పరీక్షల్లో పేపర్ లీక్‌లు, సంఘటిత అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ఉద్దేశించిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అన్‌ఫెయిర్ మీన్స్ నివారణ) సవరణ బిల్లు 2026కు సంబంధించిన ప్రతిష్ఠంభనకు లోక్‌సభలో తెరపడింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చొరవతో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో మంగళవారం నుంచి బిల్లుపై చర్చ ప్రారంభించేందుకు అన్ని ప్రధాన పార్టీలు అంగీకరించినట్లు సమాచారం. సోమవారం కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. బిల్లు ప్రవేశపెట్టే ముందు స్పీకర్ ఓం బిర్లా సభను ఉద్దేశించి మాట్లాడారు. కోట్లాది మంది విద్యార్థులు, యువత భవిష్యత్తుతో ముడిపడిన అంశం కావడంతో నినాదాలకు బదులుగా విస్తృతంగా చర్చించాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు. సభా నిబంధనల ప్రకారం బిల్లును వ్యతిరేకిస్తూ మాట్లాడేందుకు తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సౌగత రాయ్, కాంగ్రెస్ సభ్యుడు మనీష్ తివారీ, ఆర్ఎస్పీ సభ్యుడు ఎన్.కే. ప్రేమచంద్రన్ పేర్లను ప్రకటించినప్పటికీ ఎవరూ మాట్లాడలేదు. దీంతో జితేంద్ర సింగ్‌కు బిల్లు ప్రవేశపెట్టేందుకు స్పీకర్ అనుమతి ఇచ్చారు. బిల్లు ప్రవేశపెట్టిన అనంతరం స్పీకర్ మాట్లాడుతూ నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశంపై అన్ని పార్టీలు చర్చ కోరుతున్నాయని, ప్రజా పరీక్షల వ్యవస్థను బలోపేతం చేసే తొలి అడుగు ఈ బిల్లేనని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు సూచించే సవరణలను ప్రభుత్వం పరిశీలించే అవకాశం ఉందని చెప్పారు. బిల్లుపై చర్చకు ఆరు గంటల సమయం కేటాయించామని, అవసరమైతే మరింత సమయం కూడా ఇస్తామని స్పష్టం చేశారు. అధికార, ప్రతిపక్షాల మధ్య ఏకాభిప్రాయం కోసం అదనంగా మూడు గంటల సమయం కూడా కేటాయించినట్లు వెల్లడించారు.

**నీట్ వివాదాల తర్వాత కఠిన నిర్ణయం**

ఇటీవలి కాలంలో నీట్ యూజీ, యూజీసీనెట్, ఇతర కేంద్ర నియామక పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు దేశవ్యాప్తంగా తీవ్ర వివాదానికి దారితీశాయి. పరీక్షల విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తడంతో కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించింది. మెరిట్ ఆధారిత ఎంపికను కాపాడడం, సంఘటిత పరీక్షా మోసాలను అరికట్టడం ఈ సవరణల ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం చెబుతోంది. సవరణ బిల్లు ప్రకారం ప్రశ్నపత్రాలను లీక్ చేయడం, లీక్‌కు ప్రయత్నించడం, లీకైన ప్రశ్నపత్రాలను కొనుగోలు చేయడం లేదా విక్రయించడం, అనధికారికంగా ప్రశ్నపత్రాలు లేదా సమాధాన కీలు సంపాదించడం నేరంగా పరిగణిస్తారు. పరీక్షల కంప్యూటర్ వ్యవస్థలను హ్యాక్ చేయడం, డేటాను మార్చడం, ఫలితాల్లో జోక్యం చేసుకోవడం, నకిలీ పరీక్షా కేంద్రాలు నిర్వహించడం, ఇతరుల స్థానంలో పరీక్షలు రాయడం వంటి చర్యలపైనా కఠిన శిక్షలు అమలు చేయనున్నారు. వ్యక్తిగతంగా పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే మూడు నుంచి ఐదు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. సంఘటిత పేపర్ లీక్ ముఠాలకు ఐదు నుంచి పదేళ్ల వరకు జైలుశిక్ష, కనీసం రూ.1 కోటి జరిమానా విధించాలని బిల్లులో ప్రతిపాదించారు. అక్రమాలకు సహకరించిన సేవా సంస్థలపై కూడా రూ.1 కోటి వరకు జరిమానా విధించడంతో పాటు పరీక్షల నిర్వహణకు అయిన వ్యయాన్ని వసూలు చేయనున్నారు.

**బెయిల్‌కు అవకాశం లేదు**

ఈ చట్టం కింద నమోదయ్యే నేరాలను కాగ్నిజబుల్, నాన్‌బెయిలబుల్, నాన్‌కాంపౌండబుల్‌గా గుర్తించనున్నారు. అంటే వారెంట్ లేకుండానే అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఉంటుంది. బెయిల్ సులభంగా లభించదు. రాజీ ద్వారా కేసును ముగించే అవకాశమూ ఉండదు. ప్రజా పరీక్షలపై విద్యార్థుల విశ్వాసాన్ని పునరుద్ధరించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఇదిలా ఉండగా, జూలై 20న కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన "పార్లమెంట్ మార్చ్" సందర్భంగా విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారన్న ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. ఈ అంశంపైనా సభలో వాగ్వాదం చోటుచేసుకుంది.



Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com